క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



జెడ్పీ సీఈవో(ఎఫ్ఏసీ) విజయరాజుకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న ఏపీఎస్టీఏ నాయకులు

ఏలూరు(మెట్రో): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) నాయకులు జెడ్పీ సీఈవోను కోరారు. మంగళవారం ఇటీవల జెడ్పీ సీఈవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.విజయరాజును ఏపీఎస్టీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోటప్రసాద్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గంధం నారాయణరావుకు డీటీఎఫ్ మద్దతు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే నెలలో జరుగనున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గంధం నారాయణరావుకు తమ సంఘం మద్దతు తెలుపుతున్నట్టు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే. కాంతారావు, మద్దుకూరి ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సంఘం రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు ఈ ఎన్నికల్లో నారాయణ రావు విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

గౌతమీ ఆగ్రోస్ కార్మికులకు సీఐటీయూ మద్దతు

ఏలూరు (టూటౌన్): జీతాల పెంపుదల కోసం గౌతమి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్మికులు చేపట్టిన ఆందోళనకు సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ పూర్తి మద్దతు తెలియజేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. సోమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమి ఆగ్రోస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికుల జీతాల పెంపుదల,ఇతర న్యాయమైన కోరికలను పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధిక లాభసాటి అయిన మద్యం తయారీదారులు కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోవడం చాలా దారుణమని ఆయన విమర్శించారు. లేని పక్షంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన ఆందోళనకు సీఐటీయూ సంఘం తరపున మద్దతు తెలిపి వారికి సంఘీభావంగా తాము కూడా ఆందోళనలో పాలుపంచుకుంటామని తెలియజేశారు.

నగరేశ్వర స్వామికి అభిషేకాలు



నగరేశ్వర స్వామి వారికి అభిషేకం చేసేందుకు కలశాలతో బారులు తీరిన భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ నగరేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి వివిధ నదీ జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పుష్పార్చన నిర్వహించి విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగమునేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నీరుపేదలు

- మంచి నీటి కోసం కొత్తూరు బ్రిడ్జి తమ్మిలేరు గట్టు ప్రజల కటకట
- ఏళ్లుగా నూతి నీళ్లే దిక్కు

ఏలూరు రూరల్: ఏలూరు నగర కార్పొరేషన్ పనితీరు పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైన అధికారులు. కనీసం సురక్షిత తాగునీరు అందించేందుకు కూడా ప్రయత్నించడం లేదని పేదలు వాపోతున్నారు. ప్రజల సురక్షిత తాగునీరు సరఫరాపై పాలకులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తూరు బ్రిడ్జి వద్ద తమ్మిలేరు గట్టు నివాసితుల వ్యథలు ఈ ఆరోపణలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ గట్టుపై నివసిస్తున్న ప్రజలు నూతి నీళ్లే పరమావధిగా భావిస్తున్నారు. ప్రతిరోజూ నూతినీళ్లు పట్టుకుని వంటలు చేసుకుంటున్నారు. పలువురు వృద్ధులు మంచినీటి టిన్‌లను తెచ్చుకోలేక ఈ నీటిని తాగుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ దుస్థితికి కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఇక్కడ యువకులు ఆరోపిస్తున్నారు.

పైప్‌లైన్ నిరుపయోగం

పంచాయతీ పాలనలో బోరునీరు సరఫరా చేసేందుకు నాటి పాలకులు వేసిన పైప్‌లైన్ సైతం నిరుపయోగంగా మారిపోయింది. ఈ పైప్‌లైన్ నుంచి వచ్చే అరకొర నీటి కోసం మహిళలు గంటల తరబడి ఎదురు చూస్తున్నారు. తాగునీరు ఎన్నిసార్లు ఆందోళన చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం స్థానికులు చేస్తున్నారు. స్థానిక 14 డివిజన్‌లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి పైప్‌లైన్ వేయాలని కోరినా అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వేసవిలోపు స్థానిక హేలాపురికాలనీ వరకూ వేసిన తాగునీటి పైప్‌లైన్, గట్టు వరకూ పొడిగించాలని కోరుతున్నారు.



కొత్తూరు జ్యూట్‌మిల్లు వంతెన పక్క ఏటిగట్టు పరిసరాల్లో నూతి నీళ్లు పట్టుకుంటున్నా మహిళలు



అడుగంటిన నూతి నీళ్లు

నూతి నీళ్లే దిక్కు



దగ్గరలోని నూతినీళ్లే మాకు దిక్కయ్యాయి. తాగునీరు అందించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదు. నీళ్ల లేక నుయ్యి తవ్వుకున్నాం. నూతినీళ్లు తోడుకుంటాం. గత్యంతరం లేక ఈ నీటినే కాచి వడబోసి తాగుతాం. వంటకు కూడా వినియోగించుకుంటున్నాం వేసవిలో అయితే మా పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. నూతిలో నీళ్లు సైతం ఇంకిపోతాయి. ఎన్నిసార్లు బతిమలాడుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– వెంకటలక్ష్మి, స్థానికురాలు

పైప్‌లైన్ వేసినా నీరు ఉండదు



కొన్నేళ్ల క్రితం పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు మా గట్టుపైకి పైప్‌లైన్ వేశారు. చాలా సంతోషించాం. ఇక మా కష్టాలు తీరిపోయాయనుకున్నాం. తీరా చూస్తే పైప్‌లైన్ మూణ్నాళ్ల ముచ్చటగా మారిపోయింది. ఎగువ ప్రాంతాల్లో మోటార్లు ఉపయోగించడం వల్ల మా వరకూ నీళ్లు రావడం లేదు. ఇక ఏం చేస్తాం. మాకు మంచి నీళ్లు తాగే ప్రాప్తం లేదుకున్నాం. మళ్లీ నూతినీళ్లు పట్టుకుంటున్నాం.

– గాయత్రి, స్థానికురాలు

నెలకు రూ.600 ఖర్చు



ఇక్కడ బతుకుతున్న వాళ్లందరూ కాయ, కష్టం చేసుకునే వాళ్లే. రెక్కాడితే గానీ డొక్కాడదు. అయినప్పటికీ అధికారులు మా మొర ఆలకించడం లేదు. తాగునీరు కోసం రోజుకు రూ.20 ఖర్చు చేస్తున్నాం. నెలకు రూ 600 ఖర్చువుతుంది. నూతినీళ్లు తాగితే ఏం జబ్బులు వస్తాయోమోనని భయంతో చేసేది లేక నీళ్లు కొనుక్కుని తాగుతున్నాం.

–భవాని, స్థానికురాలు

పైప్‌లైన్ పొడిగించాలి



మా ఇళ్లకు దగ్గరలో హేలాపురికాలనీ వరకూ కార్పొరేషన్ అధికారులు పైప్‌లైన్ వేశారు. అక్కడ నుంచి మా గట్టుపైకి మరో 200 మీటర్లు దూరం ఉంటుంది. ఈ పైప్‌లైన్ మాకు కూడా వేయాలని కోరినా పట్టించుకోలేదు. రాబోయే వేసవికైనా అధికారులు స్పందించి మా ప్రాంతానికి నూతన పైప్‌లైన్ వేయాలని కోరుకుంటున్నాం.

– పద్మ, స్థానికురాలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజ్ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్



విష్ణువర్ధన్‌ను సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు డీఎన్ఆర్ , ఏలూరు సమన్వయకర్త జేపీ

ఏలూరు టౌన్: రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి వర్గానికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గానికి చెందిన కోమటి విష్ణువర్ధన్‌రావు ముదిరాజ్‌ను వైఎస్సార్‌సీపీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ , పార్టీ నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డీఎన్ఆర్ మాట్లాడుతూ సమాజంలో బడుగు, బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, దాసరి రమేష్, కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్, పార్టీ నాయకులు ఇనపనూరి జగదీష్, గ్రేవియర్ మాస్టర్, పల్లి శ్రీను, ప్రత్తిపాటి తంబి, బత్తిన మస్తాన్‌రావు, వైఎస్‌వీ శివరావు, మధు, తులసీవర్మ, తులసీ, మట్టా రాజు, మేతర సురేష్, ప్రేమ్‌కుమార్, బెనర్జీ, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్

ఏలూరు టౌన్: జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తోన్న పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, విధుల్లో ఉంటూ మృతిచెందిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అనారోగ్యంతో మృతిచెందిన ఎస్సై డి.నరసింహారావు కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్‌గా రూ.1లక్ష చెక్కును మంగళవారం జిల్లా ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ఏలూరు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన నరసింహారావుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు త్వరితగతిన అందజేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఇప్పటికే ఆయన కుమారుడికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించగా మంగళవారం ఆర్థిక సహాయన్ని భార్య పద్మావతి, కుమారుడు సుందర్‌కు అందజేశామని తెలిపారు. జిల్లాలో పోలీస్ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తత తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న స్టేట్‌బ్యాంక్ రీజనల్ మేనేజర్ నోరి ఎల్‌కేఎంవీ ప్రసాద్

ఏలూరు(మెట్రో): ఆన్‌లైన్ లావాదేవీలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్‌బ్యాంక్ రీజనల్ మేనేజర్ నోరి ఎల్‌కేఎంవీ ప్రసాద్ అన్నారు. ఏలూరు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో అంబికా కన్వెన్షన్ టౌన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు జాగ్రత్తలు పాటించాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్‌పై ఖాతాదారులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఏలూరు ఆర్‌బీవో జీఎం (ఆపరేషన్స్) కె.లలిత పాల్గొన్నారు.

మినీ గోకులాలపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న శాంతారాం

దెందులూరు: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మినీ గోకులాల మంజూరు, స్థలం కొలతలు నమోదు చేయాలని రాష్ట్ర సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శాంతారాం అన్నారు. దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, బీఎఫ్‌ల జిల్లా సమావేశం నిర్వహించారు. కొలతల నమోదులో ఉపాధి సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. మండల డివిజన్ జిల్లా అధికారుల నిరంతర పర్యవేక్షణ నూరు శాతం ఉండాలన్నారు. ఈ ప్రక్రియ ఆద్యంతం తనిఖీలు నిర్వహిస్తామని ఆయన అన్నారు.

రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత పౌరులు రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగంపై అవగాహనతో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.రత్న రాజు, కోనే సునీత, సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక కేపీడీటీ ఉన్నత పాఠశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకర రావు, సోషల్ వెల్ఫేర్ జేడీ వి.వి జయ ప్రకాష్, డీవీఈఓ ఆర్‌వీఎస్ఎస్ మూర్తి, బి. ప్రభాకరరావు, వి.ప్రేమ్ చంద్ పాల్గొన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్యాలయ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఈపీడీసీఎల్ ఏలూరు ఎస్ఈ పి.సాల్మన్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులకు నగరానికి చెందిన విజయ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కేఎం అంబేడ్కర్, టి.శేఖర్, పి.రాధాకృష్ణ, ఈ.సురేష్ కుమార్ పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ఏపీఎస్టీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్ ఆధ్వర్యంలో, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి, ప్రిన్స్‌పాల్ సిస్టర్ మెర్సీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

తెలుగు అనువాద పుస్తకం ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్ళాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని రాజ్యాంగ ధర్మ పరిషత్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఎస్ఏడి పాల్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజనసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యాక్రమంలో వారు మాట్లాడారు. ముందుగా స్థానిక పాత బస్టాండ్ వద్దగల డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించి అక్కడ నుంచి బైక్ ర్యాలీగా ఏలూరు ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్ చేరుకుని రాజ్యంగ దినోత్సవం నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన హక్కుల వల్లే తాము ప్రజాప్రతినిధులుగా పదవులు చేపట్టే అవకాశం దక్కిందని అన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం భారత రాజ్యాంగం తెలుగు అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త, కార్మిక ఉద్యమ నాయకుడు కేవీబీ ఆర్ అంబేడ్కర్ ను ఘనంగా సత్కరించారు. సామాజిక న్యాయ జ్వాలా రత్న బిరుదుతో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, సెట్‌వెల్ సీఈఓ ప్రభాకర్, గోపన్న పాలెం పీఈడీ కాలేజ్ ప్రిన్సిపాల్ నతానియేల్ పాల్గొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్) మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొదట బీజేపీ నాయకులు భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ చక్రవర్తి వర్మ,బొరగం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాజ్యాంగం పీఠిక ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాజ్యాంగంపై అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు



ఏలూరు (టూటౌన్): పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజ్యాంగ ధర్మ పరిషత్, ఏఐఏవైఎస్ నాయకులు



ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగం తెలుగు అనువాద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	31
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

అపార్ గుర్తింపు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ

భీమడోలు: విద్యార్థులకు అపార్ గుర్తింపు కార్డులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో ఆధార్ సవరణలకు వీలుగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల అపార్ ఐడీ నమోదును వేగవంతం చేసేందుకు మండలంలోని మూడు చోట్ల ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. భీమడోలు, గుండుగొలను ఉన్నత పాఠశాలల్లో, భీమడోలు బీఎస్ఎన్ఎల్ భవనాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. ఆధార్‌లో సవరణలు చేయించుకునేందుకు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత పత్రాలను కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. మండల వ్యాప్తంగా 90 శాతం అపార్ ఐడీ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యదేవుని వ్రతాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 42వ డివిజన్‌లో ఉన్న శ్రీ కల్యాణ వేంటేశ్వర స్వామి, జానకి రామాంజనేయ గౌరీశంకర సాయి మందిరం ప్రాంగణంలో కార్తీక బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ, మహిళా భక్త బృందం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రత కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతాలు ఆచరించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు చక్రవర్తుల ప్రకాశాచార్యులు వ్రత కథలు వినిపించి అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

శ్రీ పరమటమ్మ సన్నిధిలో వడై కార్యక్రమం

స్థానిక కొత్తపేట 42,43,44వ డివిజన్ పాత నీళ్ల ట్యాంకులో ఉన్న శ్రీ పరమటమ్మ (గోనాలమ్మ) ఆలయంలో కార్తిక మాసం శుభ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గత నాలుగు వారాలుగా ప్రతి రోజూ ఉదయం అయ్యప్ప, ఆంజనేయ, సాయిబాబా, శివ స్వాములకు,భవానీలకు స్థానికుల సహకారంతో వడై కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం 36వ డివిజన్ కార్పొరేటర్ భీమవరపు హేమ సుందరి సురేష్ పరమటమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భవానీలు, స్వాములందరూ ఆలపించిన సంకీర్తనలు, భజనలు,శరణు ఘోషతో ఆలయ ప్రాంగణమంతా మారుమోగింది. అనంతరం భీమవరపు హేమ సుందరి సురేష్ స్వాములకు, భవానీలకు అఖండ వడై వితరణ చేశారు.



సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు